ఒకానొక పక్షి కథ

శ్రీ శేఖర్

చిన్న చలిగాలిలా నడుస్తూ, వాన చినుకుల్లా గొణుక్కుంటూ సందులోంచి నడుస్తూన్న ఫణికి సముద్రపు రొద, ఎదురుగాలి స్వాగతం చెప్తున్నాయి. అలా మెల్లగా నడుచుకుంటూ బీచ్ రోడ్డులోకి దిగేడు. అక్కడంతా మంచి హడావుడిగా వుంది. కార్లు వస్తున్నాయి...పోతున్నాయి. రిక్షాలన్నీ చక్కగా ఒక వరసలో పేర్చి వున్నాయి. రిక్షా డ్రైవర్లుమాత్రం వాటి కెదురుగా ఎత్తుగావున్న హోటల్ మెట్లమీద కూర్చున్నారు. మెట్లు దాటితే పట్టపగలులా వెలుగు. మెట్లకింద చిక్కని చీకటి. అక్కడ పైసానుంచి రూపాయివరకూ అనేక రకాల ఆడా మగా ఎవరి ధోరణిలో వాళ్లున్నారు. వాళ్ల భవిష్యత్తు చూసి సముద్రం బొబ్బలు పెడ్తూంది. తన తెలివి తక్కువ తనానికి తానే నవ్వి నురగలు కక్కుకుంటూంది. ఫణి మెట్లుదాటి కుడివైపు లాన్‌లో దూరంగా వేసిన కుర్చీలవేపు నడుస్తున్నాడు.

'హల్లో! హాయ్! హాదుయుడూ!' ఎదురుగా వచ్చి పలకరిస్తాం దెవర్తో. మరొక రోజయితే భుజం మీద చెయ్యివేసి తీసుకుపోయేవాడే. కాని ఇవాళ అలా చెయ్యలేదు. తిన్నగా వేగంగా కుర్చీల దగ్గరకి పోయేడు. ఫణి మిత్ర బృందం అంతా అప్పటికే చేరేరక్కడ. ఎవర్తో ఒక చిలక ఇంచుమించు వారందరి సొత్తుగా కూర్చుందక్కడ. వాళ్ల ముఖాలుచూస్తే రెండురౌండ్లు పూర్తయినట్టు కన్పిస్తున్నాయి.

ఫణి వాళ్ల దగ్గరకు వెళ్తానే 'ఒరేయ్! పక్షిగాడు కన్పట్టం లేదట్రా! వాళ్లావిడ సాయంత్రం మా యింటికొచ్చి లబోదిబోమంది' అంటూ ఇంచుమించుగా అరిచేడు. అప్పటికి ఫణి త్రోవలో పుచ్చుకున్న పెగ్గు బాగా దిగింది. వాళ్లంతా గుర్రాలెక్కి వున్నారు.

'కన్పట్టం లేదా! చచ్చాడేమోరా!' అన్నాడు కామేశం.

'చావడం కాదురా బాబు. నిన్న ఆఫీసులో జీతం పుచ్చుకున్నప్పుడు కన్పించాడు. అంతే మరి ఇంటికి పోలేదుట' అన్నాడు ఫణి.

'వాడి మొఖం వాడెక్కడికి పోతాడ్రా! ఆ సింగు గాడి క్లబ్బులోనో, సుగుణ ఇంట్లోనో దొర్లుతూ వుంటాడు' అన్నాడు నాయుడు సిగరెట్టు పొగ మింగుతూ.

'వాడి కిది మామూలేగద. కాబూలీవాలా నుండి పనిమనిషిదాకా తనని పీక్కుతింటారని తెలుసు. అందుకే ఈ అంతర్థానం' అన్నాడు శర్మ కొత్త బుడ్డీ ఓపెన్ చేస్తూ.

ఫణి కుర్చీలో కూర్చుని గ్లాసులో బ్రాందీ, బీరు పోసుకున్నాడు. సిప్ చెయ్యడం వాళ్ల కెవరికీ అలవాటు లేదు. ఫణి గబగబా నాలుగు గుక్కలు మింగేడు. అతని ఒళ్లంతా జివ్వు మంటూంది. త్రోవలో గొణుక్కున్న విషయం మళ్లీ తెరలు తెరలుగా కళ్లలో సుడి తిరుగుతూంది. 'ఒరేయ్! ఆ వెధవకి ఎన్నిసార్లో చెప్పేన్రా తాగొద్దని. నా మాట వింటేగా!' అన్నాడు. మిగిలిన వాళ్లంతా ఒక్కసారి నవ్వేరు.

'బాగా చెప్పేవురా! నువ్వే వాడికి చెప్పవలసిన వాడివి' అన్నాడు మూర్తి అప్పుడే పక్కనున్న చికెన్ ముక్కని కదపడం కొరకబోతూ. మధ్యనున్న చిప్స్,

జీడిపప్పూ అన్నీ ఖాళీ అయిపోతున్నాయి. పక్షి సంగతి వాళ్ల కెవరికీ పట్టలేదు.

'ఒరేయ్! వా డెక్కడున్నా వెదికి తీసుకు రావాల్రా. లేకపోతే వాడి పెళ్లాం ఛస్తా నంటూంది.'

'ఛస్తే చావనిద్దూ. ఈపాటి వా డెలాగూ ఎక్కడో పడి సచ్చే వుంటాడు' అన్నాడు కాము.

'ఒరేయ్! లంజాకొడకా! నువ్వే వాణ్ణి తగల పెట్టేవు. వాడి జీవితమంతా నాశనం చేసేవు' అంటూ ఫణి మళ్లీ గ్లాసు నింపుకున్నాడు. సర్వర్ ప్లేట్ల నిండా బిరియానీ తెచ్చిపెట్టేడు. అంతే. ఒక్కొక్కడూ కుక్కల్లా కలియబడి తినడం ప్రారంభించారు మధ్యలో తాగుతున్నారు బిరియానీలో ముక్కలు ఒకడి ప్లేట్లోవి మరొకడు ఏరుకు తింటున్నారు. జిమ్ము తున్నారు. నీళ్లు పారబోస్తున్నారు.

'ఈ ఫణిగాడు పెద్ద సదాచారిలాగ చెప్తున్నాడు. లంజాకొడుకు. ఏంరా! నేనా వాణ్ణి పాడుచేసేన. మీరందరరా కలిసి వాణ్ణి బాగుచెయ్యలేకపోయారా! లంజాకొడుకుల్లారా! మిమ్మల్ని పాడుస్తాను జాగ్రత్త' అంటూ తన గ్లాసులో నీళ్లన్నీ ఫణి ముఖంమీద పోసేడు.

నాయుడు లేచి 'ఒరేయ్! అల్లరి చెయ్యకండ్రా వాళ్లు ఈడ్చేస్తారు' అంటూ సర్దుతున్నాడు.

'మళ్లీ అంటాను. మళ్లీ అంటాను. నువ్వే వాణ్ణి నాశనం చేసేవు' అంటూ తన దగ్గరున్న బిరియానీ ప్లేటు తీసి కాము ముఖాని కేసి కొట్టాడు ఫణి. గబగబా నలుగురు సర్వర్లు వచ్చి వాళ్లని గట్టిగా కసిరి మెట్లు దిగేదాకా ఇంచుమించు గెంటేరు. వాళ్లందరికీ ఒంటిమీద ఏమీ స్మారకం లేదు. ఎదురుగా సముద్రం ఎన్నిబుడ్లు తాగిందో గాని నిలవలేక పోతూంది. పెద్ద గొంతుతో పేలుతూ ముందుకు తోసుకుపడుతూంది. తాగినదీ, తిన్నదీ అంతా నురగలు నురగలుగా కక్కుతూంది. సముద్రం కోరకుండా అడ్డంగా వేసిన పెద్దపెద్ద బండరాళ్లు తాగుబోతుల తల్లిదండ్రుల, పెళ్లాల గుండెల్లా సుఖం...సంతోషం... భయం...విచారం...సిగ్గు...అవమానము ... అన్నిటి వదలుకుని చలనం లేకుండా పడున్నాయి.

....

మర్నాడుదయం తొమ్మిదిగంటలకల్లా పెళ్లాం లేపగా లేపగా లేచేడు ఫణి. ఒళ్లంతా పచ్చిముద్దలా వుంది. ఉబ్బి బయటకొస్తూన్న కళ్లు ఇంకా మూతలు పడుతున్నాయి. నుదుటి మీద తగిలిన దెబ్బకు ప్లాస్టరు అంటించి వుంది. మంచం మీద కూర్చునే పెళ్లామిచ్చిన కాఫీ తాగుతున్నాడు.

'తొమ్మిది గంటలు దాటేదాకా పడుకోకపోతే కొంచెం వేగంలేచి కూరా నారా తేగూడదా!' అంటూ రుసరుసలాడింది శాంత.

'మొన్ననే కదా కూరలు తెచ్చేను. రోజూ సామాన్లు తేవడాని కిదేం సత్రం అనుకున్నావా! సంసారం కాల్చి గంప కెత్తేస్తున్నావ్!' అంటూ ఖస్సు మన్నాడు తేలిపోతూన్న నరాల నదిమిపెట్టూ.

'ముష్టిముండా కూరతెచ్చి మూడు రోజులు సర్దమంటే నేనెక్కడ సచ్చేది. రాత్రి వందా ఏభై తగలబెట్టి తాగినప్పుడు లేదుగాని, కూర తెమ్మంటే సంసారం కాలిపోయిందా మీకు?' అంటూ ఖాళీకప్పు తీసుకుని లోపలికి పోయింది.

ఫణి ఏమో అనబోతూండగానే 'ఒరేయ్! ఫణీ!' అంటూ లోపలి కొచ్చేడు కామేశం. శాంతవంటింటి తలుపు దభీమని వేసుకుంది. 'ఒరేయ్! చచ్చాంరా. ఆ పక్షిగాడి పెళ్లాం మా ఇంటికొచ్చి తిడుతూంది. మనం వాడెక్కడున్నాడో వెతక్క తప్పదు' అంటూ చార్మినార్ సిగరెట్టు ముట్టించి మంచంమీద కూర్చున్నాడు.

'అయితే ఏం చేద్దామంటావ్?'

'ఏముంది ముందు ఆఫీసుకి సెలవు పెట్టు. నాయుడు, శర్మకూడా సెలవు పెట్టేరు. నలుగురం నాలుగుచోట్లా వెదుకుదాం.'

'సరే వుండు. నేను ముఖం కడుక్కుని వస్తాను' అని లేచి పెరట్లోకి వెళ్లేడు ఫణి. శాంత

వంటింట్లో గిన్నెలు చప్పుడు చేస్తూంది. ఫణి ముఖం కడుక్కొని, బట్టలు వేసుకునే లోగా నాయుడు, శర్మ ఇద్దరూ వచ్చేరు.

'గురూ! ఇంకా ఇలాగే వున్నారేంటి. బయలే రండి! అంటూ తొందర చేసేడు నాయుడు.

ఓయ్! ఆ పక్షిగాడు మొన్నరాత్రి కొబ్బరి తోట దగ్గర ఎవర్తెతోనో కనిపించేడని చెప్పేడు సింగు. అప్పటికే కంట్రీ బాగా కొట్టేసేట్ట' అంటూన్న శర్మ నోరు మూస్తూ 'ఒరేయ్' గట్టిగా వాగకురా బాబు! మా ఆవిడ వింటుంది' అంటూ వాళ్లను బయటకు తీసుకుపోయాడు ఫణి.

శాంత మెల్లిగా బయటకొచ్చింది. తను వండిన వంట ఎవరు తినాలో ఆవిడకు బోధపడలేదు. ఒక తాగుబోతుని వెదకడానికి నలుగురు తాగుబోతులు బయల్దేరారు. వీళ్ల కిది కొత్తేమీ కాదు. రాత్రంతా కుక్కల్లా కొట్టుకొని పగలు మళ్లీ ఇలా తిరగడానికి ఎలా మనస్కరించిందో వీళ్లకు. ఛీ! ఇలాంటి మొగుడు జన్మజన్మలకీ వద్దు! రాత్రి ఫణి ఇంటికొచ్చిన తీరు శాంత ముఖాన్ని గుద్దుతూంది ఆ వాలకాన్ని మరచిపోలేకపోతూంది. ఆవిడకు బుర్ర మొత్తుకోవాలనిపించింది. అంతకన్నా ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటె మేలు అనుకుంది. కాని ..తన పిల్లలో... ముత్యాలలాంటి పిల్లల్ని తనేంచేసి పోవాలి? పక్షి పెళ్లాం ఏడాది క్రిందట నిద్రమాత్రలు మింగిన వాడూ, ఆర్నెల్ల కిందట నూతిలో పడినవాడూ—చచ్చిపోయుంటే ఈపాటికి ఆ పిల్ల లేమయే వారు? ఛీ! ఈ తాగుబోతులకోసం మేమెందుకు చావాలి? అనుకుంది శాంత. ఆవిడ ఆలోచన క్రమక్రమంగా పక్షిగాడి మీదకు పోయింది.

అతనికి అసలు పేరు లేకపోలేదు. అయినా అందరూ పక్షిగాడనే అంటారు. మొదట్లో కొన్నాళ్లు అక్కుపక్షి అనేవారు. రాగా రాగా ఆ మనిషి మరీ వెదురుబద్దలా సగమయాడనో, లేక సులువుకోసమో 'పక్షి!' అనడం ప్రారంభించేరు. పాపం! పక్షి మొదట్లో తాగేవాడు కాడు. తన జీతంతో హాయిగా గడపవచ్చువని పెళ్లాం చేస్తూన్న ఉద్యోగం కూడా మాన్పించేడు. పోనీ ఆ ఉద్యోగమున్నా ఈ రోజు ఆవిడ సుఖపడేది. ఆవిడ మొదట్లో ఎంత అందంగా, కులాసాగా ఉండేది! ఈ ఇంటికొచ్చి గంటల తరబడి కబుర్లు చెప్పేది. ఎంత హాస్యంగా మాట్లాడుతుందని! క్రమంగా ఇంటికి రావడం మానుకుంటే గర్వమేమోననుకునే దాన్ని. ఏడాది దాటిన తరువాత బజార్లో...పూర్ణా మార్కెట్టు దగ్గర.. దూరంగా, నీరసంగా, విస్తేజంగా కనిపిస్తే పిల్లపుట్టాక అరోగ్యం చెడిపోయిందనుకున్నాను. అంతేకాని ఆ దౌర్భాగ్యుడు తిండికిలేకుండా తాగుతున్నాడని గ్రహించ లేకపోయేను. ఎంత సిగ్గు విడిచి పెట్టేడో! తను పోషించవలసింది పోయి తండ్రికి మిగిలిన ఐదెకరాల పొలం వ్యాపారం పేరు పెట్టుకొని అమ్మించి, ఆ సొమ్మంతా తాగి తందనాలాడి వాళ్లను బికార్లను చేసేడు. ఆ బెంగంతో వాళ్ళు కుళ్లిపోయేరు. పెళ్లాం మెళ్లోవున్న బంగారమంతా కరగిపోయింది. ఏడాదికిందట మామగారొచ్చి 'చావకురా నాయనా! ఈ రెండు వేలూ తీసుకుని అప్పు తీర్చు. ఇక మీదైనా బుద్ధిగా వుండు'. అని ఇచ్చిన డబ్బులో సగం తాగుడుకీ ముండలకీ అప్పచెప్పేడు. నెల నెలా ఫస్టు వచ్చిందంటే పక్షిప్రాణం గిలగిలకొట్టుకుంటుంది. జీతంలో మూడువంతులు బిల్లు చేస్తూన్నప్పుడే కోసేస్తారు. ఇంక తాగడానికేముంది? పెళ్లాం పిల్లలకు పెట్టడానికేముంది? లంచాలు పట్టి ఎట్టి పీకలమీదకు తెచ్చుకున్నాడు—ఇలా ఆలోచిస్తూ వుండగా పిల్లలు బడినుండి వచ్చేరు.

'అమ్మా నాన్నగారు ఆఫీసుకు వెళ్లిపోయారా?' అన్నాడు పుస్తకాలపెట్టె టేబిలుమీదపడేస్తూ శేఖర్.

'అమ్మా! నాన్నగారు పొద్దున్న లేవరు. సాయంత్రం రారు. మరెప్పుడు మేం మాట్లాడ్డం' అంది సుజాత కాళ్లు కడుక్కుంటూ.

'ఇప్పుడు నాన్నగారితో మీ కేంటి పని. అన్నం పెడతాను రండి' అంటూ వంటిట్లోకి పోయి కంచాలువేసి, పీళ్లు పెట్టూంది శాంత,

'ఏమంటేనే మాట్లాడాలేంటే! అవునుగాని పొద్దున్న చూసేమ· నాన్నగారికి నుదుటిమీద దెబ్బెలా తగిలింది?' అంటూ పీటమీద కూర్చుంది సుజాత.

'నీ కెందుకే ఆ ఆరాలన్నీను...ముసలమ్మలా ఏదో చిన్న దెబ్బ తగిలిందిట. మందు పెట్టేను. అదే పోతుంది.'

'అమ్మా! నీ కెందుకు నాన్నగారంటే అంత కోపం?' అన్నం తింటూ తలదించుకుని అడిగేడు శేఖర్.

'మిమ్మల్ని నన్ను ఇంత ముద్దుగా చూస్తున్నారనీ! ముందు నోరు మూసుకుని అన్నం తినిపో' అని కసురుకుంటూ గదిలోకి పోయింది శాంత. ఎదురుకుండా పెళ్లిఫోటో కన్పిస్తూంది. పది సంవత్సరాలయింది పెళ్ళయి. ఈ కొద్ది కాలానికే తమలో శారీరకంగా ఏర్పడినమార్పు, మానసికంగా ఏర్పడిన దూరం—ఆవిడ భయ కంపితురాల్ని చేస్తున్నాయి. పక్షి దంపతుల రూపురేఖలు రావడానికి ఇంక కొద్ది కాలం చాలునేమో! ఆ ఆలోచన రాగానే అక్కడ నిల్చోలేక పోయింది. ఎక్కడికైనా వెళ్లి కొన్నాళ్లు గడిపివస్తే బాగుణ్ణని అనిపించింది. కాని ఎక్కడికి వెళ్లగలదు? గుమ్మందాటి బయటకు వెళ్లేసరికి అందరూ తనవైపే చూస్తున్నట్లు...ఏదో అనుకుంటున్నట్లు అనిపిస్తుంది. పుట్టింటికి వెళ్తే అందరూ తన మొగుడి గురించే అడుగుతారు. ఎవరైనా తమ ఇంటికివస్తే ఆ సమయానికి ఫణి ధోరణి ఎలాగుంటుందో! అందుకే తను ఎవరింటికీ వెళ్లడం మానేస్తే అందరూ దీనికి గర్వమనుకుని వాళ్లుకూడా రావడం మానేస్తారు—అదే బాగుందనుకుంది శాంత. బంధువులన్న వాళ్లెవరికీ ఉత్తరాలు కూడా రాయడం మానేసింది. దాంతో వాళ్లూ మానుకున్నారు. పిల్లలంటూ లేకపోతే తన ఒంటరి జీవితానికి అర్థం లేకపోను—ఛ—ఎంతసేపిలా ఆలోచిస్తాను అనుకుంటూ లేచింది. పిల్లలిద్దరూ అన్నం తిని వీధి బీడీలో కూర్చుని ఏదో మాట్లాడుకుంటున్నారు. ఫణి భోజనాని కొస్తాడనే నమ్మకం లేదు. అయినా శాంతకు భోజనం చేయాలనిపించలేదు. కొంచెం సేపు పిల్లలతో హాయిగా మాట్లాడుకుందామని అటు వెళ్లబోయింది.

'సుజా! నీకు అమ్మంటే ఇష్టమా? నాన్నగారంటే ఇష్టమా'? అడుగుతున్నాడు శేఖర్ గాలిపటానికి చితారు కడ్తూ.

'నాకు నాన్నగారంటేనే ఇష్టం. అమ్మ ఎప్పుడూ నవ్వదు. నాన్నగారు ఆదివారం నవ్వుతారు.' సిగ్గుమాలినవాడు నవ్వకేం చేస్తాడనుకుంటూ వెనక్కి తిరిగిపోయి పడుకుంది శాంత.

శాంత నిద్ర లేచేసరికి పిల్లలు రెండో పూట బడికిపోయేరు. దగ్గర దగ్గర మూడున్నరవుతూంది. ఫణి మాత్రం ఇంటికి రాలేదు. శాంతకి బాగా నీరసంగా వుంది. లేచి ముఖం కడుక్కుని కాఫీ పెట్టుకుని తాగింది. ఆ తర్వాత ఏం చెయ్యడం? రెండవ పూట వంట చెయ్యవలసిన పనిలేదు. ఫణి ఎలాగూ భోజనానికి రాడు. పొద్దున్న వండిందే పిల్లల కింత పెట్టి తనింత తినవచ్చును లెమ్మనుకుంది. ఇంత వేగంగా తెలివివచ్చినందుకు చికాకు పడింది. ఏం చెయ్యడం? అనే ఆలోచనలోనే కాలం గడుస్తూంది. ఏదో పత్రిక తీసి చదవడం ప్రారంభించింది.

'అమ్మాయ్! శాంతా!' ఎవరిదో పిలుపు. లేచి ముందు గదిలోకి వెళ్తూంటే పక్షి మామగారు లోపలికొస్తున్నాడు.

'రండి బాబాయిగారూ! కూర్చోండి' అంటూ కుర్చీ చూపించింది.

అతని ముఖం బాగా పీక్కుపోయింది. ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటూ 'బాగున్నావా అమ్మా!' అని ప్రశ్నించేడు.

'నా బాగుకేం లెండిగాని మీ అల్లుడి సమాచారం ఏమన్నా తెలిసిందా?'

'ఇంక వాడి గురించి తెలిసినా ప్రయోజనం లేదమ్మా! నేనొక నిశ్చయాని కొచ్చేను. నా కూతురు విడాకులు తీసుకుంటుంది. ఇప్పుడే లాయరుగారితో మాట్లాడి అన్ని ఏర్పాట్లు చేసేను.' శాంత నిర్ఘాంతపోయింది.

'ఇందుకు మీ అమ్మాయి ఒప్పుకుందా బాబాయ్?'

నా కూతురు ఎప్పుడో ఒప్పుకుంది. అది అడిగిన నాడే నేను ఒప్పుకునివుంటే ఈ నాడు దాని పరిస్థితి ఇంత నికృష్టంగా వుండేది కాదు.'

'మీరు బాగా ఆలోచించారా?'

'ఇంకా ఆలోచించే దేమిటమ్మా! ఆలోచించి ఆలోచించి నా కూతురుకి పిచ్చెక్కేదాకా ఆలస్యం చేసేను. ఎవరో ఏదో అనుకుంటారని, మాన మర్యాదల పేరుపెట్టుకుని ఇంకా కుళ్లిపోవడం అనవసరం. నా కూతురు మూడేళ్లనాడే 'నాన్నా! నేను విడాకులు తీసుకుంటాను' అని అడిగింది. ఆ రోజు నా కూతురు మంచిది కాదనుకున్నాను. నయానా, భయానా వచ్చ జెప్పేను. నా మాట కాదనలేక—వాడితో బతకలేక ఇవాళ నా కూతురు ఎలా తయారయిందో నీకు తెలియదమ్మా! నువ్వు దాని ముఖం చూస్తే ఇలా గనవు.'

శాంత మర్యాదకోసం అలా మాట్లాడిందే గాని మనసులో పక్షి పెళ్లాం చేసిన పనికి చాలా సంతోషించింది. పెళ్లి చేసుకున్నంతమాత్రాన చెడిపోయిన మొగుడికోసం తమ జీవితాన్ని బలిపెట్టడం శుద్ధ తెలివితక్కువ అనుకుంది. కాని పక్షి పెళ్లాం చదువుకుంది. రేపు ఉద్యోగం చేసుకుని బ్రతుకుతుంది. తనకు సర్టిఫికేట్లు లేవే! కూలి, నాలి చేసుకుంటేనే తప్ప గతిలేదు. అందుకు సిద్ధపడ్డా లోకం తనకా అవకాశమివ్వదు— ఇద్దరూ అలా మాట్లాడకుండా కూర్చున్నారు. శాంత లేచి నిమ్మరసం కలిపి తెచ్చింది.

గ్లాసు అందుకుంటూ 'ఈ రోజు రాత్రి బండికి మేం వెళ్లిపోతున్నామమ్మా! బహుశా మళ్లీ ఈ ఊరు రావలసిన అవసరముండదు. నిన్ను, ఫణిని ఒకసారి చూసిపోదామని వచ్చాను' అన్నాడు.

'ఆయన మీ అల్లుణ్ణి వెదకడానికి వెళ్లేరు బాబాయ్!' అంది గ్లాసందుకుని కింద పెడ్తూ.

'ఆ సంగతి తెలుసమ్మా! నువ్వెవరో నాకు ముందు తెలియదు. కాని ఫణిని నా చేతులతో ఎత్తుకుని తిప్పిన క్షణాలు నాకు బాగా జ్ఞాపకమున్నాయి. పాపం! వాళ్ల నాన్న ఎంత పరువు, మర్యాదలకోసం పాకులాడేవాడో. ఫణి ఇలా తయారౌడని అతనికి తెలియదు.'

'నేనేం చేసేది బాబాయ్! ఆయన ఎంత చెప్పినా వినరు.'

'ఒకరు చెప్తే వాళ్లు వినరమ్మా! వాళ్లకు తెలియదా వాళ్ల కళ్లముందు ఎన్ని బతుకులు నాశనమవుతున్నాయో! అయినా తమ వ్యసనాలు మానుకోరు వాళ్లు. నువ్వు ధైర్యంగా వుండమ్మా! కాలానికి చాలా విలువుంది. ఏ క్షణం వాళ్లను మార్చగలదో! నేను వస్తానమ్మా' అంటూ లేచాడతను.

'అతన్ని చూస్తానన్నారు గదా! ఒక్క అరగంట కూర్చోండి. ఇక నొచ్చేస్తారు! అంది శాంత తను కూడా లేస్తూ.

'ఫరవాలేదమ్మా! అతన్ని ఇప్పుడే కామేశం ఇంట్లో చూసేను. ఇంతవేగం వచ్చే స్థితిలో లేడు. నువ్వు దిగులు పడకు. పరిస్థితులు మారకపోవు. ఫణి ఇంకా మా అల్లుడిలా తయారవలేదు. తప్పకుండా బాగుపడతాడు' అంటూ అతను వెళ్లిపోయాడు.

ఇకమీద శాంతను గురించి నేను మీకేమీ చెప్పదలచుకోలేదు. కాని ఒకటిమాత్రం నిజం. తననికూడా ఇలాగే ఎవరైనా వచ్చి తీసుకుపోతే, తన పిల్లలమీద మొగుడినీడ పడకుండా, కలో గంజో తాగి బతుకుదామనే అనుకుంటూంది.

....

ఫణి బృందం మిత్రద్రోహులుకారు. వాళ్లు పక్షికోసం విశాఖపట్టణంలోని సారాకొట్లు, సాని కొంపలూ అన్నీ వెదికేరు. వాళ్ల జాతి వాళ్లనందరినీ అడిగేరు. కాని లాభం లేకపోయింది. ఆ నిరాశను పూడ్చుకోవాలని తోవలో బ్రాందీ బుడ్లు కొనుక్కుని కామేశం ఇంటికి పోయేరు. కామేశం భార్య పతివ్రత. అతని సంతోషమే ఆమె సంతోషం. కామేశాన్ని అతని స్నేహితుల్ని ఒక్కలాగే చూస్తుంది. అయినా కిట్టని వాళ్లంతా పుట్టింటినుంచీ ఆవిడకున్న తాగుడు అలవాటే కామేశం చెడిపోవడానికి కారణమని ఆడిపోసుకుంటారు.

పక్షి గురించి అతని స్నేహితులకు తెలియని రహస్య మొకటుంది. పక్షి ఫస్టు తారీఖున అనుకోకుండా అప్పుల వాళ్లకి దొరికిపోయేడు. ఎంత ప్రయత్నించినా ఒక్కరూపాయికూడా మిగుల్చుకోలేకపోయేడు. అయినా అధైర్యపడలేదు. అతని ఆత్మ విశ్వాసం అచంచలమైనది. కాఫీ చుక్కైనా దొరకని ఇంటికి వెళ్లడం అనవసర మనుకున్నాడు. జేబులో మిగిలిన చార్మినార్ సిగరెట్టు ముట్టించి అలవాటు ప్రకారం బీచ్‌రోడ్డులోకి దిగేడు. మిత్రులంతా వస్తారుకదా అని ఆ పెద్ద హోటలు దగ్గరకు చేరుకున్నాడు. అప్పటికి 6 గంటలవుతూంది. మనుష్యులు స్కూటర్లమీద, కార్ల మీద ఒంటిగాను, జంటగాను వచ్చి లాన్లలో సర్దుకుంటున్నారు. సముద్రం గాలి హాయిగా తగులుతూంది. హోటలు ఆవరణలో సందడి క్షణక్షణం ఎక్కువవుతూంది. పక్షి చేతిలో ఆఖరి చార్మినార్ ఆరిపోయింది. మిత్రులింకా రాలేదు. ఇంకా ఎదురు చూడాలంటే బాధగా వుంది. పోనీ అలా మీదకు పోయి మళ్లీ వద్దామనుకున్నాడు. బీచ్‌రోడ్డు పట్టుకుని తిన్నగా నడిచేడు. ఎంతదూరం నడుస్తున్నదే అతనికి తెలియదు. అలా రామకృష్ణా మిషన్ దగ్గరకు చేరుకోగానే అతనికి బాహ్యప్రపంచంతో సంబంధం కలిగింది. ఆ సాయంత్రంవేళ...రామకృష్ణా మిషన్ దగ్గర...... బీచ్‌లో...అటువంటి దృశ్యం వుంటుందని పక్షి ఎన్నడూ భావించలేదు. ఎన్నో కార్లు, స్కూటర్లు పార్కుచేసి వున్నాయి. సిటీ బస్సులలోంచి మనుష్యులు...ఆనంద మూర్తులు వరసగా దిగిపోతున్నారు. బీచ్ వాతావరణ మంతా ఆనంద కోలాహలంగా వుంది. ఎటు చూచినా చిన్నపిల్లల కేరింతలే...ఎటు చూచినా యువతీ యువకుల జంటలే...సంతోష తరంగాలే...ఆ ఆనందంలో తనకు గాని, తన భార్యాబిడ్డలకు గాని ఎక్కడా చోటు లేదని గ్రహించడంతో పక్షికి ఆ వాతావరణం వెగటు గొల్పింది. అక్కడ ఒక్క క్షణం నిలవలేకపోయాడు... అంతేగాని అతను మారిపోలేదు. ఇక్కడ లేని చోటు అక్కడ పొందుదామని మళ్లీ వెనక్కి బయల్దేరాడు. గబగబా నడిచేడు. అతను తిరిగి హోటల్ చేరుకునేసరికి 8 గంటలయింది. అప్పటికి హోటల్ ముందు లాన్స్‌లోని టేబిళ్లన్నీ గలగల లాడిపోతున్నాయి... జంటలన్నీ మత్తెక్కి సోలిపోతున్నాయి. సర్వర్లందరూ హడావుడిగా తిరుగుతున్నారు. పక్షి ఆతురతగా మెట్లన్నీ గబగబా ఎక్కి లాన్సులో చూసేడు...నలువైపులా కలయచూసాడు...కాని మిత్రు లెవ్వరూ రాలేదు .. టేబిళ్లు గలగల లాడుతున్నాయి...బుడ్లు ఓపెన్ అవుతున్నాయి. అక్కడ నిలవలేక వెనక్కి తిరిగాడు.

సరిగ్గా అప్పుడే కన్పించింది సముద్రం పక్షి కళ్లకి...పగిలిన బ్రాందీ బుడ్డీలా! సరిగ్గా అప్పుడే కన్పించాయి బండరాళ్లు...సముద్రం బ్రాందీ బుడ్డీకి పగిలిన గాజుపెంకుల్లా!

అవును! అదంతా బ్రాందీయే అయుంటుంది! కాకపోతే కెరటాలకు ఆ తూగు ఎలా వస్తుంది? మత్తెక్కించే ఆ ఘోష ఎలా పుట్టుతుంది?

తన శరీరానికి ఆ తూగు...తన నరాలకు ఆ ఘోష కావాలి!! అప్పుడే ఓపెన్ చేసిన బ్రాందీ బుడ్డీలా సముద్రం నురుగులు కక్కుతూంది.

పక్షి గొంతుక తడిసిపోయింది.. ఆ బ్రాందీ అంతా తాగి తన దాహం తీర్చుకోవాలనుకున్నాడు. అంతే! అతివేగంగా మెట్లు దిగి సముద్రంలోకి నడిచేడు.

అతన్ని చూసి భయపడిన సముద్రం 'ఒద్దు! ఒద్దు! నా దగ్గరకు రాకు' అని పెద్దగా అరుస్తూ వెనక్కి తగ్గింది. పక్షి చేతులు చాచుకుని ముందుకు దూకేడు...సముద్రం తన శక్తినంతా వినియోగించి ముందుకు తోసింది...కాని ఆ బలంకన్న పక్షి ఆత్మ బలం గొప్పది...అతడు తన దాహం తీరా సముద్రాన్ని తాగేడు...తమ సొత్తు కాజేస్తున్నాడని కాబోలు తాగుబోతు చేపలు అతని ముఖాన్ని పీకి ముందుకు తోసాయి. కాని పక్షి తన దాహాన్ని తీర్చుకునిగాని బయటకు రాలేదు.

కరుణాసముద్రుడు పక్షిని ఒడ్డుకు చేరవేసాడు. శరీరానికి మత్తెక్కించే ఆ సముద్రపు ఘోష వింటూ...బండరాళ్ల సందులో పక్షి మత్తుగా పడుకున్నాడు. ఆ మత్తు దిగదు...పక్షి ఆనందం చెదరదు.